కథావేదిక

# మేడ్ ఫర్ ఈచ్ అదర్

- యర్రా సుధాచంద్ర

మీది అన్యోన్యమైన జంట, మేడ్ ఫర్ ఈచ్ అదర్ అని అందరూ కాకపోయినా కొద్దిమందైనా మాజంటని మెచ్చుకుంటూ ఉంటారు. ప్రేమించి పెళ్ళిచేసుకోకపోయినా, పెళ్ళి చేసుకుని ప్రేమించుకుంటున్న వాళ్ళం గత ఎనిమిది ఏళ్ళుగా. మేమిద్దరం, మాకిద్దరు అన్నట్లుగా మాకు ఒక అమ్మాయి ఒక అబ్బాయి. ఇంత ఉపోద్ఘాతం ఎందుకబ్బా అనుకుంటున్నారు కదూ! వస్తున్నాను అసలు కథలోకి. మాకు పెళ్ళయింది మొదలు మేము మాటా, మాటా అనుకుని ఎరుగం. ముందే చెప్పాగా మాది అన్యోన్యమైన జంట అని. కాని ఇప్పుడు నాకొక సమస్య వచ్చిపడింది.



ఆకాశ్‌కు ఏమయిందో తెలియదు నాతో మూడు రోజులుగా ముభావంగా ఉంటున్నారు. అలాగని నన్ను విసుక్కున్నదీలేదు. ఎందుకనో మనసులో బాధపడుతున్నారనిపించింది. మాకు సినిమా కష్టాల్లాంటివేమీ లేవు. ఇద్దరం ఉద్యోగస్థులమే కనుక ఆర్థిక ఇబ్బందులేమీలేవు. అసలు ఆఫీసులో జరిగిన చిన్న ఇన్సిడెంట్ కూడా నాతో చెప్పనిదే ఆయనకు తోచదు. అలాంటిది, ఇప్పుడేమి చేయాలో నాకేమీ అంతుపట్టలేదు. ఈరోజు అనుకోకుండా ఆయన డైరీ చూశాను. 'ఆకాశ్ నాకు తెరిచిన పుస్తకం అని ఇన్నాళ్ళూ తలపోశాను. ఇప్పుడు కాదేమోనన్న అనుమానంతో డైరీని తీసాను. అతని పర్సనల్ డైరీ చదవడం సంస్కారం కాదని తెల్సినా అతని బాధ తెల్సుకోవడంకోసం, అయిష్టంగానే అయినా తెరువక తప్పలేదు.

ఆదివారం:- నా 'భావన'కి నేను సరిజోడు కాదేమో అనిపించింది. ఈరోజు సినిమాలో ఆమె అభిప్రాయం విన్నాక. ఆమె నన్ను ఎంపిక చేసుకోవడంలో పొరపాటు పడిందేమో. ఆమె అందానికి తగిన వాణ్ణి కాకపోయినా మంచి భర్తననే ఇన్నాళ్ళూ తలపోశాను. కాని నా అభిప్రాయం తప్పేమో నన్న భావం నన్ను నిలువునా కృంగదీస్తోంది.

సోమవారం:- ఎంత ప్రయత్నించినా నేను మామూలుగా ఉండలేకపోయాను. ఎంతో ఎడ్జస్టయి నాతో పెళ్ళికి ఒప్పుకుందేమో అన్న ఫీలింగ్ నుండి నేను బయటకు రాలేకపోయాను. ఈనా ఆలోచనలవల్ల 'భావన'ని ఎంతో ఇబ్బందికి గురిజేస్తున్నాననిపించింది.

మంగళవారం:- నా ఈ బాధకు కారణం ఏమయి ఉంటుందా అన్న మీమాంసలో ఉన్నట్టనిపించింది. అనవసరంగా నేను ఆత్మన్యూనతకు ఫీలయి ఆమెను బాధపెడుతున్నానా అనిపించింది. ఇంత సన్నగా పొట్టిగా ఎందుకు పుట్టానా అనుకుంటున్నాను.


నాకు ఇప్పుడర్థం అయింది. చటుక్కున డైరీ మూసేశాను. నిజానికి నాకు కోపం కాస్త ఎక్కువే. కాని అది ప్రదర్శించే అవకాశం ఆకాశ్ సమక్షంలో నాకెప్పుడూ కలుగలేదు. నా మనసు తెలుసుకుని మసలుకునే ఆకాశ్‌కి నేనెప్పుడూ ఎదురు చెప్పలేదు. అన్యోన్యత అనే పదానికి అర్థం మేమిద్దరం అనుకునేదాన్ని. అది నిజంకాదేమో అన్న అపనమ్మకం నాకు ఈక్షణం కలిగింది మొట్టమొదటిసారిగా.

ఏమనుకుంటున్నారు ఆకాశ్ గురించి. డైరీలో రాసిన విషయం గుర్తొచ్చి కాబోలు కోపంతో నా ముక్కుపుటాలు అదిరినయ్. సారీ మీకు అసలు విషయం చెప్పలేదు కదూ మొట్టమొదటి నుండి చెపుతాను.

నాకు అమ్మా, నాన్నా లేరు. ఉన్నదల్లా అన్నయ్యొక్కడే. ఒకరోజు అన్నయ్య తన ఆఫీసులోనే పనిచేస్తున్న ఆకాశ్ గురించి చెప్పాడు. చాలా బుద్ధిమంతుడమ్మా. తన మంచితనంతో అందర్నీ ఆకట్టుకున్నాడు. అతనితో నువ్వు సుఖపడగలవన్న నమ్మకం నాకుంది అన్నాడు. కాకపోతే కాస్త పొడుగు తక్కువ. నీకు ఇష్టమయితే పెళ్ళిచూపులు ఏర్పాటు చేస్తాను అన్నాడు. ఎప్పుడూ నాసుఖం, సంతోషం కోరుకునే అన్నయ్య మాటలు కాదనాలనిపించలేదు.

ఆ తర్వాత మూడురోజులకి అన్నయ్య, ఆకాశ్‌ని తీసుకుని వచ్చాడు. నన్ను చూసి చిన్నగా నవ్వాడు. అందమయిన అతని ముఖం నవ్వితే పలువరుస మెరిసి మరింత అందంగా అనిపించాడు. రంగు తక్కువే. నేను అందగత్తె కిందే లెఖ్ఖ (అందరూ అలా అంటుంటారు). అన్నయ్య చెప్పినట్లు అతను పొడుగు తక్కువే అనిపించింది. నాకు కాబోయే భర్తను గురించి ఎక్కువ ఆశలు, కోరికలు లేవు కనుక నాకు 'ఆకాశ్ నచ్చారు. వెంటనే పెళ్ళయిపోయింది. ఈ ఎనిమిదేళ్ళలో నాకు బాధ కలిగించే సంఘటన ఆయనవల్ల ఎదురుకాలేదు. అలాంటిది ఇప్పుడేమిటి?

ఆరోజు ఆదివారం కావటంతో సినిమాకు వెళ్ళాం. అది హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా కావడంవల్ల కాబోలు చిన్న హీరోని తీసుకున్నట్టున్నారు. హేండ్సమ్‌గా లేడు. నాకు నచ్చలేదన్నాను. ఎందుకని అడిగారు ఆకాశ్.



అంత పొట్టివాడు అతనేం హీరో. హీరో అంటే ఎలా ఉండాలి. ఆరడుగుల ఎత్తు, విశాల ఛాతి భాగం, పత్తైన క్రాఫూ, కండలు తిరిగిన దేహం... ఇలా తమాషాగా వర్ణించుకుంటూపోయాను. అదే ఆకాశ్ బాధకు కారణమయిందని డైరీ చదివాక అర్థమయింది. ఇంతలో ఆకాశ్ తలుపుతోసుకుని వచ్చాడు. విసురుగా నాచేతిలోని అతని డైరీని అతని ముందు పడేశాను. ఏమిటిది ఆకాశ్. ఇంత అర్థంలేకుండా ఫూలిష్‌గా ఉన్నాయేంటి మీ ఆలోచనలు. ఒక సినీ హీరో గురించి నా అభిప్రాయం చెప్తే దాన్ని మీకు మీరే అన్వయించుకుని బాధపడ్తారా? చదువు, సంస్కారం ఉన్న మీరు ఆత్మన్యూనతకు గురయితే ఎలా ఆకాశ్? భార్యను జీవితాంతం సంతోషపెట్టేవాడు, ఆమె మనసెరిగి మసలుకొనేవాడు భార్య దృష్టిలో నిజమైన హీరో అని మీకు తెలియదా? అయినా సినిమా హీరోలాగా నా భర్త ఉండాలని కోరుకున్నదాన్నయితే మన పెళ్ళి జరిగుండేదా? నచ్చక ఎడ్జెస్టయినట్లుగా ఒక్కనాడైనా ప్రవర్తించానా? ఇన్నాళ్ళుగా కలసి కాపురం చేస్తున్న భార్యను మీరర్థం చేసుకున్నదింతేనా? అర్థం పర్థంలేని ఆలోచనలతో మీరు బాధపడి నన్ను బాధపెట్టారు! ఎప్పుడూ నాకోపం చూడని ఆయన సారీ అంటూ నాదగ్గరకు రాబోయారు. 'డోంట్ టచ్‌మీ' పెద్దగా అరిచాను. ఆయన ఖిన్నుడయ్యారు. అయినా నేను లెఖ్ఖచెయ్యలేదు. వెంటనే డోర్ తెరచి బయటకు వెళ్ళాను.

నావెనకాలే కిచెన్‌లోకి వచ్చారు. మెల్లగా అన్నారు. సారీ భావనా, తప్పుగా ప్రవర్తించాను. ప్లీజ్ నన్ను క్షమించవూ అన్నారు. సరే క్షమించానుగాని నాకొక సహాయం చేస్తారా అడిగాను.

అడుగు అన్నారు. నాకు విడాకులివ్వండి అన్నాను. నేను అందగాణ్ణి, హీరోలాగా ఉండే అతన్ని చూసి పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను. ప్లీజ్ మనిద్దరం విడిపోదాం అన్నాను.

ఆకాశ్ మతిలేనివాడిలా చూశాడు నావైపు. అతని కళ్ళల్లో బాధ రెపరెప లాడటం స్పష్టంగా కనిపించింది. భావనా నువ్వు నిజంగా అంటున్నావా? నమ్మలేనట్లుగా చూశాడు. అవును ఆకాశ్ నువ్వు వ్రాసిన ఈరాతలు, మూడురోజులుగా నీ ప్రవర్తన నిజమైతే నేను మాట్లాడేది కూడా నిజమే.

అందరూ మనిద్దరినీ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అంటుంటే మీరు అన్నా అనకపోయినా మేము నిజంగానే మేడ్ ఫర్ ఈచ్ అదర్ అని గర్వంగా అంటుండేదాన్ని. ఇప్పుడు అందరూ నవ్వుతారు అంతేగా నవ్వనివ్వండి దుఃఖంతో నా గొంతు మూగబోయింది. ఈడైలాగ్‌లన్నీ ఆకాశ్‌ని బాధపెట్టడానికే కావాలని అంటున్నానని అతనికర్థం అయింది. నన్ను ప్రేమగా దగ్గరకు లాక్కుని నుదురు చుంబించారు. మూడురోజులుగా అనుభవించిన బాధనంతా మరచి అతని గుండెల్లో ఒదిగిపోయాను.

★